# చీర

"సుచరిత"

"పండక్కి అమ్మాయి వస్తానని ఉత్తరం రాసింది. దాన్నెప్పుడూ వట్టి చేతులతో పంపవలసి వస్తోంది. ఈసారైనా దానికి చీరపెట్టి పంపాలి".

ఆడపిల్లలు ఈ నగ మా అమ్మ పెట్టింది. ఈ చీర మా పుట్టింటొరు పెట్టారు. ఈ వస్తువు మా ఆయన కొన్నాడు అని చెప్పుకోవడంలో ఆనందపడిపోతారు అలాంటిది తాను చీర పెట్టడం యింత వరకు కుదరనే లేదు కూతుర్ని మేనల్లుడికి యిచ్చాం గాబట్టి అతగాడికి తమ పరిస్థితి పూర్తిగా తెల్సు గాబట్టి తమ వద్ద నుండి అతగాడు కూడా ఏం ఆశించడు. ఎప్పుడైనా పండక్కో పబ్బానికో పిలిస్తే ఎందుకత్తా ఖర్చు అని దాటేస్తాడు. నర్సమ్మ ఆ రోజు వంట చేస్తున్నంత సేపూ యివే ఆలోచనలు.

భర్త తెచ్చింది తనూ భర్తా తినడాన్కే సరిపోతొంది. తను గూడా ఏదో ఒక పని చేస్తానంటే. నువ్వు సంపాదిస్తుంటే నేను గాజు తేసుకొని కూకోవాలా? అంటాడు. ఏలాగైనా అమ్మాయి వచ్చేసరికి చీర రెడీ చెయ్యాలి అనుకొంది నరస్సమ్మ.

* * * * *

'పన్నమ్మ సినిమా కెడదాం వస్తావా?' అంటూ రామలక్ష్మి వచ్చి పిల్చింది.

ఏం సినిమానో ఏమోనే అమ్మాయ్! నాకు భక్తి సినిమాలు తప్ప నచ్చవే. నువే పోరాదూ? నర్సమ్మ అంది.

"భక్తి సినిమానే పన్ని చానా బాగుందట! ఉదయం ఆటలెగా బాబాయ్ డ్యూటీ నుండి వచ్చేసరికి మనం సినిమా చూచి రావచ్చు" బ్రతిమలాడింది రామలక్ష్మి.

'డబ్బులు లేవు లేవే రామలక్ష్మి నువ్వు వెళ్లిరా నా మనస్సు కూడా ఏం బాగలేదు".

'నా దగ్గరున్నాయిలే పన్ని నువ్వు చీర మార్చుకొని బయలుదేరు ముందు. బట్టలు మార్చుకు వస్తాన్నేను' అని వెళ్ళింది రామలక్ష్మి.

హాలు దగ్గర జనం కిక్కిరిసి వున్నారు.

టిక్కెట్లు దొరికేలా లేవు పన్ని' అంది రామలక్ష్మి.

"నువ్వుండవే. యింత దాకా వచ్చి సినిమా చూడకుండా వెళ్లిపోవడమా నువ్వు యిక్కడే వుండు నేను వెళ్లి పట్టుకొస్తాను టిక్కట్లు" అంటూ నర్సమ్మ జనంలోకి వెళ్లిపోయింది. పది నిముషాల్లో చేతిలో టిక్కట్లుతో వచ్చిన నర్సమ్మను చూచి ఆశ్చర్యపోయింది రామలక్ష్మి.

సినిమా మొదలయ్యింది. పదిహేను నిముషాల తర్వాత భక్తిరసంతో మునిగిపోయారందరూ. దేవతా వేషధార్లు తెర పైకి రాగానే మేనేజిమెంట్ వారు యధాశక్తి దూప దీపాలు హారతులు వెలిగిస్తున్నారు.

ఢమరుకాల మోతలతో తప్పెట డోలు వాయిద్యాలతో పాట మొదలైంది తెర మీద. కన్పించే దృశ్యానికి అనుగుణంగా హాల్లో చిందులు మొదలయ్యాయి. యిలాంటిది ముందే వూహించిన మేనేజిమెంటు వారు పసుపు నీళ్ళు, వేపమండలు, సాంబ్రాణి పొగ సామాగ్రి సిద్ధం చేశారు. పూనకాలు వచ్చిన వాళ్లను శాంతింప జేయడాన్కి తాపత్రయ పడుతున్నారు. ఒకళ్లను శాంతపర్చే సరికి మరొకళ్లకు వస్తోంది పూనకం.

తెర మీద గోల కంటే హాల్లో గోలతో పాటు ఎవర్ని



దేవత ఆవహిస్తుందో నన్న భయం ఏర్పడింది. పాట అయిపోయిన తర్వాత పది నిముషాలకు సద్దుమణిగింది.

యింటర్‌వెల్ అయిపోయింది.

హాలు ముందు ఆవరణలో దేవి విగ్రహాన్కి యధావిధి పూజలు జరుగుతున్నాయి. అందరూ విభూతి కుంకుమా తీసుకు వెడుతున్నారు.

నర్సమ్మ రామలక్ష్మి కూడా తీర్థ ప్రసాదాలు విభూతి కుంకుమలు తీసుకొన్నారు.

విభూది పెట్టుకో పిన్నీ నీకసలే భక్తి ఎక్కువ. అమ్మవారు పూనిందంటే.... అసలే నాకు భయం మళ్లీ లోనికి వెళ్లేటప్పుడు చెప్పింది రామలక్ష్మి.

'పిచ్చిదానా భయమెందుకో నవ్వుతూ అంది నర్సమ్మ.

* * * * *

మళ్లీ సినిమా ప్రారంభం అయ్యింది. మరో భయంకర సన్నివేశం వుందనీ అప్పుడింకా పూనకాలు ఎక్కువ వస్తాయని జనం అనుకొంటున్నారు. ఆ సన్నివేశం ఎప్పుడా అని అందరూ ఎదురు చూస్తున్నారు. అరగంట గడిచింది.

ఆ సన్నివేశం రానే వచ్చింది. ముందు జాగ్రత్తగా మేనేజిమెంటు వాళ్ళు రంగంలోకి దిగారు సాంబ్రాణి వగైరాలతో ...

వూఁ హూఁ హఁ హఁ ......

పూనకాల వాళ్ళు వూగుతున్నారు. చిందులు వేస్తున్నారు.

'వూఁ హూఁ హూఁ......'

నర్సమ్మ లేచింది కుర్చీలోంచి. రామలక్ష్మి దూరంగా పోయింది. సాంబ్రాణి పొగవాడు – వేపమండల వాడు, పసుపునీళ్ల బకెట్ వాడూ అందరూ చేరారు.

"అమ్మా శాంత పడమ్మా, ఏం అపచారం జరిగిందమ్మా?" సాంబ్రాణి పొగవాడు గుప్పెడు సాంబ్రాణి నిప్పుల్లో పోసి విసిరాడు.

"ఆఁ ఆఁ వూఁ వూఁ హహ హఁ"

వూగిపోతోంది నరసమ్మ.

"ఏం తల్లీ ఏం కావాలి తల్లీ?" చుట్టూ చేరిన వారిలో నుండి ఒకాయన అడిగాడు.

# చీర

"రేయ్ నా సంగతి బొత్తిగా మర్చిపోయార్రా".

'అమ్మా! ఎవరమ్మా నువ్వు?'

నేనా! నన్ను గుర్తుపట్టవా? నేను రా మహంకాళి చెల్లెల్ని మరిడమ్మని.

"దండాలు తల్లీ దండాలు." ఎందుకొచ్చావ్ తల్లీ ఏం గావాల?

'రేయ్? అన్ని పూజలూ మహంకాళికి అయితే మరి నా సంగతేమిట్రా'.

'తల్లీ శాంతించు తల్లీ. నువ్వే కన్నెర్రజేస్తేవా మేం మాడిపోతామ్'

ఆఁ ఆఁ అలా రండిరా దారికి. నాగ్గావలసింది యిస్తారా?' నర్సమ్మలోని మరిడమ్మ అడిగింది.

'ఏం గావల జెప్పు తల్లి. కొలుపులు జెయ్యమంటావా. మేకపోతును బలి యివ్వమంటావా?' 'అయేం వద్దు. నాకు యింత పసుపు కుంకుమలిచ్చి ఫట్టుచీర పెట్టి పంపండి' చిందులు తొక్కుతూ అడిగింది నర్సమ్మ ఉరఫ్ మరిడమ్మ.

'అలాగే తల్లీ అలాగే శాంతించు, శాంతించు' అంటూ హాలు కుర్రాడిని ఓనరు దగ్గరకు పంపించారు జనం.

"సార్! సార్! ఎవరో ఒకామెకు పూనకం వచ్చింది సార్ మరిడమ్మ పూనింది".

ఆఁ అయితే ఏమంటావ్? ఓనరు అడిగాడు. హాలంతా గోలగా వుంది సార్. పసుపు కుంకుమా పట్టు చీరా కావాలంట. అవి తెమ్మని అందరూ నన్ను పంపారు సార్.

"ఏడిశావ్. మరిడమ్మ పూనటమేమిట్రా. రోజూ గంతులేసే ఆ పూనకాల వాళ్లంతా మనం డబ్బులిచ్చి పిలిపించే వాళ్లే కదా క్రొత్తగా ఈవిడెవరు. రహస్యంగా పదో పరకో కావాలంటే సరిచెయ్ యిచ్చేద్దాం" ధీమాగా అన్నాడు ఓనరు.

నావల్ల కాదండీ. ఆమె అలాంటి రకం కాదు. నిజంగానే ఆ మరిడమ్మ తల్లి పూనినట్టుంది.

రేయ్ సాంబడూ నిజంగా పూనకాలు వస్తాయంటావా? "ఏమో వాదనకు యిది సమయం కాదండీ. అవిడను చూస్తుంటే మిమ్మల్ని నన్ను కూడా పీక్కుతినేలాగుంది ముందు పట్టు చీర తేకపోతే జనం నన్ను బ్రతకనిచ్చేటట్టు లేరు. అదుగో వాళ్లే వస్తున్నారు చెప్పండి."

నలుగురైదుగురు ఆడామగా వచ్చారు ఆఫీసు దగ్గరకు "ఏవండీ ఓనరు గారూ మీరేం పట్టించుకొన్నట్టు లేదు. హాల్లో ఆవిడను పట్టుకో లేకుండా వున్నాం ముందా పసుపు కుంకుమ పట్టు చీర తెప్పించండి." దబాయించారు వాళ్లందరూ.

యింక తప్పలేదు ఓనరు గార్కి క్యాష్ కౌంటర్లోంచి మూడొందలు తీసి యిచ్చారు సాంబడికి.

రయ్యిన పోయి పట్టు చీర తెచ్చాడు సాంబడు.

"రేయ్ తెండిరా ఆ చీర యిలా తెండి. అమ్మా! తల్లీ మరిడమ్మ తల్లీ యిదిగో పట్టుచీర శాంతించు తల్లీ" హాల్లో జనంలో ఒకామె చీర లాక్కుని నర్సమ్మ మీద కప్పింది.

ఆఁ హాఁ, యిక వెళుతున్నానురా, నన్ను మరువకండి నర్సమ్మలోని మరిడమ్మ పలికింది.

'పోయిరా తల్లీ పోయిరా' అరిచారందరూ.

* * * * * *

రామలక్ష్మి నర్సమ్మను బయటకు తీసుకు వచ్చింది. "రావుడూ ఎందుకే అపుడే బయటికి రమ్మన్నావ్. సినిమా యింకా అయిపోలేదుగా" అమాయకంగా అడిగింది నర్సమ్మ.

నీకు తెలీదు పిన్నీ నిన్ను మరిడమ్మ తల్లి పూనింది బాగా అలిసిపోయావ్. సినిమా పోతేపోయింది యింటికి పోదాం పద అని రిక్షా మాట్లాడింది రామలక్ష్మి.

నర్సమ్మను యింటి దగ్గర దింపి తనూ వెళ్లింది.

నర్సమ్మ ఒక్క ఉదుటున లోనికి వచ్చింది. కనకదుర్గ పటం ముందు వాలింది. "నన్ను క్షమించు తల్లీ నన్ను క్షమించు. కూతురికి చీర కొని పెట్టలేని స్థితిలో నాటకం ఆడాను. నాకు యింత కంటే మార్గం కన్పించలేదు. నా మీద పగపట్టమాకు నన్ను నీవే...."

ప్రాన్పడి పోయింది రామలక్ష్మి. నర్సమ్మను పరామర్శిద్దామన్న తల్లిని వెంట బెట్టుకొని వచ్చింది. నర్సమ్మ వేడుకోలు యింకా విన్పిస్తూనే వుంది రామలక్ష్మికి. □




